క్లుప్తంగా

మహా పడిపూజ



కాళేశ్వరం: 'దివ్య పదునెట్టాంబడి మహా పడి పూజ' కార్యక్రమాన్ని కాళేశ్వరంలో సర్పంచ్ వెన్నపురెడ్డి వసంత-మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా గురువారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ చక్రవర్తుల పురుషోత్తమాచార్యుల గురుస్వామివారితో వైభవోపేతంగా పూజ తంతు చేపట్టారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్ప మాలధారణ భక్తులు, గ్రామస్తులు తరలివచ్చారు. పూజా కార్యక్రమంలో పాల్గొని ఆటపాటలు, నృత్యాలతో అలరించారు. స్వామి శరణం అయ్యప్ప శరణం అంటూ భక్తుల భజన కీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తులు స్వామివారి పూజలో పాల్గొని 'అరువన్నం' ప్రసాదాన్ని స్వీకరించారు.

మండల సభ వాయిదా

చిట్యాల: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించాల్సిన మండల సర్వ సభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీపీ దావు వినోద పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమం ఉండటం వలన కోరం సభ్యులు రాలేకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం అనంతరం మళ్లీ సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు.

నియామకం



కాటారం: నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్సీ) జిల్లా ఉపాధ్యక్షుడిగా కాటారం మండలం దామెరకుంటకు చెందిన ఆత్మకూరి స్వామియాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య, జిల్లా అధ్యక్షుడు కుమార్‌యాదవ్ గురువారం నియామక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర, జిల్లా అధ్యక్షులతో పాటు కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు స్వామియాదవ్ ఈ సందర్భంగా తెలిపారు. స్వామియాదవ్ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

సరుకుల పంపిణీ



ములుగు/ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రగతి కాలనీకి చెందిన మేకల భాగ్యలక్ష్మీ ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబానికి గంధ్రకోట సుధీర్‌సేవా ఫౌండేషన్ సభ్యులు నిత్యావసర సరుకులు బియ్యం, కూరగాయలు, కిరాణ సామగ్రి పంపిణీ చేశారు.

గ్రామ సభల ద్వారానే ఎంపిక చేయాలి



ఏటూరునాగారం: ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల ఎంపిక గ్రామసభల ద్వారానే జరగాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ చట్టాలకు లోబడి ఈ ప్రాంతంలో తెలంగాణ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల ద్వారానే జరగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఏటూరునాగారం డివిజన్ అధ్యక్షుడు టింగ బుచ్చయ్య, గొంది కామేష్, పూనెం రాధాకృష్ణ, వాజేడు మండల కార్యదర్శి సుధాకర్, వెంకటాపురం మండల అధ్యక్షులు తుర్స కృష్ణ బాబు, చంటి, నేత్ర నందు పాల్గొన్నారు.

పరామర్శ



గోవిందరావుపేట: మండలంలోని పస్రా గ్రామానికి చెందిన బైరి శ్రీకాంత్, చల్వాయి గ్రామానికి చెందిన గుర్రం విజయ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ గురువారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట జిల్లా, మండల నాయకులు ఉన్నారు.



కాటారం: గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ నారాయణ



ధన్వాడలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే



మల్హర్: దరఖాస్తులు స్వీకరిస్తున్న అవినాష్



చిన్నతూండ్లలో దరఖాస్తులు తీసుకుంటున్న తహసీల్దార్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



చిట్యాల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ(కొత్తపల్లిగోరి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అర్హులందరికీ అందజేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి ఆరు గ్యారంటీల దరఖాస్తును స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీలను తప్పనిసరిగా అమలు చేస్తుందని అన్నారు. అలాగే మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పున్నం లక్ష్మీ, జెడ్పీటీసీ సాయిని విజయ, సర్పంచ్ సూదనబోయిన రజిత, స్పెషల్ ఆఫీసర్ శామ్యుల్, తహసీల్దార్లు సత్యనారాయణ స్వామి, రవికుమార్ ఎంపీడీఓ సురేందర్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు న్యాయం చేయాలన్నదే సీఎం లక్ష్యం

మొగుళ్లపల్లి: ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు అందించి న్యాయం చేయాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సర్పంచ్ మోటె ధర్మారావు అధ్యక్షతన నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై అభయ హస్తం ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి పథకాన్ని తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ప్రత్యేక అధికారి సునీత, తహసీల్దార్ సునీత, ఎంపీపీ సుజాత సంజీవరెడ్డి, ఎంపీడీఓ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి నరేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆకుతోట కుమారస్వామి, టౌన్ అధ్యక్షుడు క్యాత రాజు రమేష్, ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, నాయకులు పోలునేని లింగారవు, తక్కలపల్లి రాజు, రఫీ,పున్నం చందర్ రావ్, జయపాల్ రెడ్డి, బక్కిరెడ్డి, ప్రకాశ్‌రావు, రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం అందించే ఆరు గ్యారంటీలు అర్హులందరికీ అందిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్.విజయలక్ష్మి, ఎంపీడీఓ రామయ్య, ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, జెడ్పీటీసీ గొర్రె సాగర్, ఎంపీటీసీలు కటూకూరి పద్మ నరేందర్, దబ్బెట అనిల్, సర్పంచ్ ఇరుకులపాటి పూర్ణచందర్ రావు, ఎంపీఓ రామకృష్ణ, పీఆర్ఎఈ రవి కుమార్, కామిడి రత్నాకర్‌రెడ్డి, ముకిరాల మధువంశీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని చిట్యాల, కై లాపూర్, చింతకుంటరామయ్యపల్లి, పాశిగడ్డతండా, లక్ష్మీపూర్ తండాలో గ్రామ సభలు నిర్వహించారు. మండలంలో మొదటి రోజు 386 దరఖాసులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ప్రజాపాలన

కాటారం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాపాలన కార్యక్రమం పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కాటారం ఆర్డీఓ నారాయణ, మండల ప్రత్యేకాధికారి సంజీవ్‌రావు తెలిపారు. మండలంలోని మద్దులపల్లి, బయ్యారం, ధన్వాడ, ప్రతాపగిరి, వీరాపూర్, ధర్మసాగర్ గ్రామాల్లో గురువారం ప్రజాపాలన గ్రామ సభలు కొనసాగాయి. ఆయా గ్రామ పంచాయతీల్లో అభయాస్తం ఐదు గ్యారంటీల దరఖాస్తులను లబ్ధిదారులకు అందజేసిన అధికారులు సమాచారం తెలియజేడం, దరఖాస్తులు నింపడానికి, స్త్రీ, పురుషుల దరఖాస్తులను స్వీకరించడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దరఖాస్తుల విషయంలో నెలకొన్న సందేహాలను ఆయా గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులు నివృత్తి చేశారు. మొదటి రోజులో భాగంగా ఆరు గ్రామపంచాయతీల నుంచి 405 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. ధన్వాడ, మద్దులపల్లి గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామసభలను జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే పరిశీలించారు. దరఖాస్తు విధానం, దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య, ప్రజాపాలన గ్రామసభ కొనసాగుతున్న తీరుపై ఎస్పీ ఆరా తీశారు. ఈ కార్యక్రమాల్లో సీఐ రంజిత్ రావు, ఎస్సై అభినవ్, ప్రజాపాలన జీపీల ప్రత్యేక అధికారులు ఎంపీఓ వెంకన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ రాజశేఖర్, ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు రజిత, ఉమ, రాజశేఖర్ పాల్గొన్నారు.



మహాముత్తారం: రెడ్డిపల్లిలో..

దరఖాస్తుల స్వీకరణ

మల్హర్: ఆరు గ్యారంటీల అమలే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని గురువారం అధికారులు షూరు చేశారు. తొలిరోజు మండలంలోని మల్లంపల్లి, దుబ్బపేట, ఇప్పలపల్లి, కొండంపేట, అడ్వాలపల్లి, చిన్నతూండ్ల గ్రామాల్లో అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందర్మ ఇళ్లు, చేయూత పథకాలతో నూతన రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకున్నారు.

294 దరఖాస్తులు స్వీకరణ

మండలంలోని ఆరు గ్రామ పంచాయతీల్లో 1095 అభ్యర్థులకుగాను 294 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. మల్లంపల్లిలో 25, కొండంపేటలో 14, దుబ్బపేటలో 43, చిన్నతూండ్లలో 116, ఇప్పలపల్లిలో 42, అడ్వాలపల్లిలో 54 వినతులు స్వీకరించారు. ఈ కార్యాక్రమంలో మండల ప్రత్యేకాధికారి అవినాష్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ నరసింహామూర్తి, ఎస్సై నరేష్, ఏఓ సుధాకర్, సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: బంగ్లాపల్లిలో ..



మహాముత్తారం: వజినేపల్లిలో..

మహాముత్తారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం గురువారం మండలంలోని ఐదు గ్రామాల్లో అధికారులు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో అధికారులు ముందుగా సీఎం సందేశాన్ని ప్రజలకు చదివి వినిపించారు. అనంతరం దరఖాస్తులు స్వీకరించారు. మొదటి రోజు మండలంలోని మహబూబ్‌పల్లి, ప్రేమ్‌నగర్, వజినేపల్లి, సింగంపల్లి గ్రామాల్లో ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ఐదు గ్రామాల్లో 244 దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లింగమల్ల శారద, పంచాయతీ ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ శ్రీనివాస రావు, పంచాయతీరాజ్ ఏఈ రమేష్‌బాబు, వ్యవసాయ అధికారి సతీష్, ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆరు గ్రామాల్లో ప్రజాపాలన

మండలంలోని వజినేపల్లి, మహాముత్తారం, బోర్లగూడెం, మీనాజీపేట, ములుగుపల్లి, యామన్‌పల్లి గ్రామాల్లో నేడు శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



మొగుళ్లపల్లి: గుడిపహాడ్‌లో..



కాళేశ్వరంలో..

ప్రారంభమైన ప్రజాపాలన కార్యక్రమం

మొగుళ్లపల్లి: మండలంలోని ఆరు గ్రామ పంచాయతీల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు గురువారం ఆయా గ్రామాల్లో ప్రారంభించారు. బంగ్లాపల్లిలో ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి సునీత మాట్లాడుతూ.. 218 అప్లికేషన్లు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణవేణి, తహసీల్దార్ సునీత, ఎంపీఓ వీరస్వామి, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం, మెట్‌పల్లి, పలుగుల, అన్నారం, మద్దులపల్లి, చంద్రుపల్లి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, సర్పంచ్ శోభ, ఎంపీటీసీ మమత గురువారం ప్రారంభించారు. అనంతరం ఆరు గ్యారంటీల దరఖాస్తులను స్వీకరించారు.

ప్రతీ కుటుంబానికి రాముడి అక్షింతలు




సమావేశంలో పాల్గొన్న విశ్వ హిందూ పరిషత్ సభ్యులు

మొగుళ్లపల్లి: అయోధ్య రామయ్య అక్షింతలను ప్రతి ఇంటికీ పంపిణీ చేస్తామని విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందాల చందర్‌బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి ఒకటి నుంచి 15వ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి కుటుంబానికీ రాముడి అక్షింతలు అందజేయడం జరుగుతుందన్నారు. అయోధ్య శ్రీరామ జన్మభూమిలోని జనవరి 22న శ్రీ బాల రాముడి విగ్రహ పునఃప్రతిష్ఠాపన చేయనున్నట్లు తెలిపారు. అదే శుభముహూర్త సమయానికి మనకు దగ్గరలో ఉన్న ఆలయాల్లో హిందూ బంధువులతో కలిసి భజన కీర్తనలు నిర్వహించాలన్నారు. టెలివిజన్ లేదా డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేసుకొని రాముడి నూతన విగ్రహ పునఃప్రతిష్ఠాపన ప్రత్యక్ష ప్రసారాన్ని సామూహికంగా వీక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ వరంగల్ విభాగ్ ప్రచారక్ విగ్నేశ్వర్ జీ, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మండల సంచలన సమితి సంయోజక్ శ్రీరామ్ రఘుపతి, సహ సంయోజక్ కనుకుల లక్ష్మారెడ్డి, సభ్యులు బాపురావు, శ్రీనివాస్ రావు, వేముల కిరణ్ కుమార్ గౌడ్, దేవునూరి కుమార్ మహిపాల్ రెడ్డి, శ్రీమన్నారాయణ, నగేష్, భద్రయ్య, చందర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

ఏటూరునాగారం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. మండలంలోని రొయ్యూర్ ఇప్పలగడ్డ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె గురువారం తనిఖీ చేశారు. అనంతరం టీచర్లు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఎలాంటి పోషకాహారం అందిస్తున్నారని ఆరా తీశారు. క్రమం తప్పకుండా పోషణ అందిస్తున్నారా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

బీసీలకు సముచిత స్థానం

ములుగు: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ)లో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్నామని నియోజకవర్గ అధ్యక్షుడు భూక్య జంపన్న నాయక్ అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయిన మాజీ రిటైర్డ్ ఆర్మీ వీరబోయిన రాజేందర్‌ను జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం శాలువాతో కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాజేందర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు జంపన్న నాయక్, మాజీ జిల్లా అధ్యక్షుడు శనిగరపు నరేష్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జ్ సతీశ్, కృష్ణ, ముఖేష్, రాజశేఖర్‌వర్మలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



రాజేందర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జంపన్న

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను ఆ పార్టీ నాయకులు గురువారం నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేసి కేక్ కట్ చేశారు. కార్యకర్తలు మిఠాయిలు తినిపించుకుని జై కాంగ్రెస్ అంటు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజల పార్టీ అని ఎప్పటికీ ప్రజల పక్షానే ఉంటుందన్నారు. కాంగ్రెస్‌తో పేదల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కాటారం: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



టేకుమట్ల: జెండా ఎగురవేస్తున్న సతీష్ గౌడ్



చిట్యాలలో..



భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకల్లో శ్రేణులు



రేగొండ: ఆవిర్భావ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు

ఇంటింటికీ దరఖాస్తు పత్రం అందజేస్తాం..

ఏటూరునాగారం: ఏటూరునాగారం గ్రామ పంచాయతీ పరిధిలోని వార్డుల వారీగా ఆరు గ్యారంటీ పథకాలకు చెందిన దరఖాస్తు పత్రాన్ని ఇంటింటికి ఇవ్వడం జరుగుతుందని సర్పంచ్ ఈసం రామ్మూర్తి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామ సభలు జనవరి 2, 3, 4వ తేదీల్లో జరుగుతాయన్నారు. బూటారం, ఎక్కెల, ఏటూరునాగారంలో మూడు రోజుల పాటు ఈ గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎవరు కూడా దరఖాస్తులను జిరాక్స్ సెంటర్లలో కొనుగోలు చేయవద్దన్నారు.



మాట్లాడుతున్న ఈసం రామ్మూర్తి